# బ్రతుకు భయం

**వెం**కటయ్య వేగంగా సందు మలుపు తిరిగేడు. అతన్ని ఉదయం నించి విసిగిస్తోన్న నల్లకుక్క తోక ఆడించుకుంటూ వెళుతోంది. మెరుపులా కదిలి దాని మీదకు తాడు విసిరేడు. అది మళ్ళీ తప్పించుకుంది.

'గిట్ల సతాయిస్తున్నదేంది? మబ్బులలేచి ఎవని మొగం చూసినానో ఏమో ఈ దిన ఒక్క కుక్కను పట్టకపోతి' అనుకుంటూ, సందు చివరలో వున్న వేన్ వైపు చూశాడు. ఆ వేన్‌లోని కుక్కలన్నీ హృదయవిదారకంగా ఆర్తనాదాలు చేస్తున్నాయి. వాటి ఏడుపులన్నీ శవం ముందు కూర్చుని బాధాతప్త హృదయంతో ఏడ్చే ఏడుపుల్లా వున్నాయి.ఏ కుక్కో చేసిన నేరానికి కుక్కల జాతి సమస్తం బలి కావలసినదేనా? అన్నట్టుగా వున్నాయి వాటి అరుపులు. కాటువేసే పామునీ, కుక్కనీ, చీమనీ, సమస్త జంతుజాలాన్నీ బ్రతకనీయని మనిషి మానవత్వాన్ని తలుచుకొని అవి గొంతెత్తి విలపిస్తున్నాయి.

ఆ మునిసిపాలిటీ వేన్‌లో స్వేచ్ఛగా వీధుల్లో తిరిగే కుక్కల్ని బంధించడానికి కారణం, ఆ వూళ్ళో రెండు నెలల క్రితం జరిగిన ఓ దారుణం. పిచ్చెక్కిన ఓ కుక్క ఇద్దరు పాదచారుల్ని కరిచింది. వారు చనిపోయేవారకూ తెలీదు. ఆ కుక్కకు రేబిస్

అని. ఆ పిచ్చి కుక్కని చంపేసినా, మిగిలిన వీధి కుక్కలు కూడా అలా పిచ్చెక్కుతాయని యుద్ధ ప్రాతిపదికమీద టౌన్‌లోని కుక్కలన్నిటినీ ఏరిపారేసేందుకు ఆర్డరు జారీ చేశారు. వీధికుక్కల్ని పట్టి ఇచ్చిన వారికి పారితోషికం ప్రకటించారు.

ఆ ప్రకటన విని వెంకటయ్య మహదానందం చెందేడు. కుక్కల్ని కరవకుండా పట్టుకోగల విద్య అతడికి చిన్నతనంలోనే అబ్బింది. దానికి కారణం ఫుట్‌పాత్ మీద సాగిన అతడి శైశవం. ఊహ తెలీని వయసులోనే తల్లి, తండ్రీ ఒకే తోవ చూసుకోవడంతో బాల్యం చెత్తకుండీ పక్కన వీధి కుక్కలతో పాటుగా సాగింది. కుక్కల్లో కుక్కగా బ్రతికే అతణ్ణి చూసి జాలిపడి ఓటీ కొట్టువాడు కప్పులు కడిగే పనికి పెట్టుకున్నాడు. ఒకసారి పొరపాటున చెయ్యి జారి కప్పులు పగలడంతో జాలి స్థానే కోపం చోటుచేసుకుని ఆ టీవాలా బయటకు తరిమేశాడు.

అలా బైటకొచ్చిన వెంకటయ్య కొన్నాళ్ళు బాల్యం గడిచిన ఫుట్‌పాత్ మీదే అడుక్కున్నాడు. మిగతా బిచ్చగాళ్ళు తమకు పోటీగా వచ్చిన కొత్త బిచ్చగాణ్ణి చూసి "అవయవాలన్నీ శుభ్రంగా వున్నాయి, పని చేసుకో రాదూ" అంటూ గెంటేసారు. అలా అడుక్కోవడానికి కూడా హక్కు కోల్పోయి, బస్టాండులో కొన్నాళ్ళు మూటలు మోసాడు. అలా మూటలు మోస్తూనే ఆర్టీసీ డిపో మేనేజర్ గారింట్లో పనికి కుదిరేడు. ఆయనకు పిల్లల్లేరు. ప్రేమగా చూసుకునే మూడు కుక్కలున్నాయి. జబ్బొచ్చినా రాకపోయినా వారినికి రెండుసార్లు పశువుల ఆసుపత్రికి వాటిని తీసుకుని వెళ్ళడం అతని డ్యూటీ. బాల్యావస్థలో వీధి కుక్కలతో స్నేహంగా మెలగడం వల్ల సింహాల్లాంటి ఆ కుక్కల్ని తేలికగా మచ్చిక చేసుకున్నాడు. ఆ కుక్కల మీద ఆధారపడిన అతడి బతుకు హాయిగా సాగిపోయింది. సరిగ్గా ఆ సమయయంలోనే మేనేజర్‌గారికి బదిలీ కావడంతో బ్రతుకు రోడ్డు మీదకొచ్చింది. మూటలు మొయ్యడం, డబ్బులు దొరికినపుడు తినడం లేనపుడు ఏటీ నీళ్ళో తాగి బస్టాండులో పడుకోవడం అలా సాగిపోతోంది జీవితం. అలాంటి విపత్కర పరిస్థితిలో మునిసిపాల్టీవారి కుక్కలు పట్టి అప్పగించే పని మొదలవడంతో మళ్ళీ ఆశ చిగురించింది. కుక్కల పుణ్యమా అని నాలుగు డబ్బులు దొరికితే కొన్ని రోజులు గంజనీళ్ళయినా త్రాగొచ్చు అనే

ఆశతో ఉన్నాడు.

ఆలోచనల్లో వున్నవాడల్లా వెళ్ళిపోతున్న కుక్కల వేన్‌వైపు చూసి నిస్సహాయంగా నిలబడ్డాడు. ఆ రోజు ఉదయం నించీ ఏ కుక్కా తనకు దొరకనందుకు బాధపడుతూ, తననించి జారుకున్న నల్లకుక్కను మరోసారి తిట్టుకొని కడుపులో టీ నీళ్ళు వేసుకుందామని అమీన్ టీ బంకు కేసి నడిచాడు.

నీరసంగా వస్తున్న వెంకటయ్యను చూసి "ఏమిరా పిచ్చోనిలెక్క పడినవ్ ఆ కుక్క వెంట, దాన్ని బ్రతకనియ్యరా పాపం" అన్నాడు. అమీన్ పొయ్యి మీద కాగుతున్న వేడినీళ్ళల్లో టీ గుండ పోస్తూ...

"ఆ నల్లకుక్కను పట్టకపోతే నేనీదినం గంజినీళ్ళు ముట్టను భాయ్... ఐదుకల్లా దాన్ని వేన్‌లోకి నూకాల,నీకు దెల్వదా నా సంగతి, నేపట్టినంటే విడ్వ," అన్నాడు ధృఢంగా అమీన్ ఇచ్చిన టీ తాగుతూ.

"ఎన్ని కుక్కలు పట్టినవ్ బిడ్డా" అన్నాడు అమీన్ టీ వడకట్టే గుడ్డను నీళ్ళలో వేసి కడుగుతూ.

"ఐదు దినాల ముందు రెండు మొన్న ఐదు, నిన్న రెండు. ఈ పొద్దుగాల ఒకటీ దొరకలేదు, గా యాదగిరి పకీరు నా తోనే పోటీ కొస్తున్నరుగా పోరగాండ్లు ముందు వెనక చూడకుండ కుక్కల మీద పడుతున్నరు, చీల్చినయ్యంటే కండ కూడా మిగల్దు..." ఆఖరి టీ చుక్క కూడా పూర్తిగా చప్పరించి అన్నాడు.

"పైసలు ఇచ్చినార్రా మునిసిపాలిటీ వాండ్లు," తన పాత బాకీ తీరుస్తాడనీ ఆశతో అడిగేదు అమీన్ బీడీ వెలిగిస్తూ...

"ఇయ్యలేదు భయ్... ఇంకా ఇయ్యలేదు, బిల్లు కాలేదంట. సర్కారు పైసలు రావాల్నంటే కష్టం అయితదిలే" అన్నాడు. అలా అనేంతలో ఆ గల్లీలోంచి పరిగెడుతున్న కుక్కలు. దూరంగా వినిపించిన కుక్కలవేన్ హారన్. ప్రాణభయంతో పరిగెడుతున్న

మూడు కుక్కల్లో తనను వేధించిన నల్లకుక్క ఉండడం చూసి వేగంగా అక్కణ్ణించి కదిలి "వరేయ్ జర ఆగుండ్రి" అని అరిచేడు దూరంగా పరిగెడుతున్న యాదగిరి, పకీరులను చూస్తూ.

వాళ్ళు తమ పరుగు ఆపలేదు. అతనితో మాట్లాడితే కుక్కలు తమకు దొరక్కుండా పోతాయని గబగబా పరిగెడుతున్నారు.

వెంకటయ్య శక్తి కొద్దీ పరిగెత్తేడు. అప్పటికే వేన్ రెండు సందులు దాటి హైవే మీదుగా ఆగింది. వెంకటయ్య ఇంకా యాదగిరి పకీరు పరిగెత్తడంతో, డ్రైవర్ ఆగిన వేన్ లోంచే బైటకు దిగకుండా, "వరేయ్ పర్లాంగు దూరంలో స్టేషన్ ముంగిట టిపిన్లు చేయనీకి ఆపుతాం. మీరు కుక్కల వెంట పడుతున్నారని మీ వెనక కుక్కల్లా మేం తిరగాలని లేదురా" అన్నాడు.

"ఏంది సార్... చాలా కష్టమయితది, జర ఆగుండ్రి వున్న పాట్నే ఈడ్చుకొస్తాం" అన్నాడు యాదగిరి ప్రాధేయపడుతూ.

"మీతో ముచ్చట్లు పెడితే మాదిమాగులు కరాబవుతాయిరా, చల్ ఎల్లి పొండ్రి... ఈడనించెలి" అంటూ వేన్ స్టార్ట్ చేశాడు డ్రైవరు. అది దుమ్ము లేపుతూ వారి ముందు నుంచే వెళ్ళిపోయింది. అది కదిలిన మరుక్షణం ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"ఇన్నేసి కుక్కల్ని పట్టిచ్చినాంగానీ, సర్కారు డ్రైవరు గానికి మనమీద దయలేకపాయె. ఈడ నించి ఆడికి కుక్కల్ని తీసికెళ్ళడం మాటలా...!" అన్నాడు పకీరు, బీడీ వెలిగించి పైకి పొగవదులుతూ...

"ఒక పని చేద్దామురా, మనలో ఒక్కొక్కనితోటీ అయ్యేడిది కాదు... ముగ్గురం మూడు దిక్కులా వెదుకుదం... ఎవనికి దొరికినా కుక్కలకు సర్కారు వాండ్లు ఇచ్చే పైసలు సమానంగా పంచుకుందాం" తీర్మానం చేసాడు వెంకటయ్య. ముగ్గురూ మూడు వైపులా వెళ్ళేరు.

* * * * *

వెంకటయ్య నడవట్లేదు, పరిగెడుతున్నాడు. అతని ముందు నడుస్తున్న పకీరు, యాదగిరి క్షణాల్లో అదృశ్యమయ్యారు. ఇంతలో అతని ప్రక్కనించి పోలీసు వేన్ దూసుకెళ్ళింది. క్షణంలో ఆ వేన్ క్రింద పడేవాడు.

వేన్‌లోని పోలీసాయన పరిగెడుతున్న వెంకటయ్యను చూశాడు. అతడిలో ఏదో అనుమానం క్షణంలో అతడి భృకుటి ముడి పడింది. తన జేబులోంచి ఓ కాగితం తీశాడు. దానిలో వున్న ఫోటోను వెనుక పరిగెడుతున్న వెంకటయ్యని మార్చి మార్చి చూసాడు. పక్కనే వున్న ఇంకో పోలీసు మిత్రుడికి చూపించాడు. వెంటనే అతనన్నాడు "ఔను.. ఆవ్యక్తే... ఈ వ్యక్తి అదే ముఖం... అవే మీసాలు... గుర్తు పట్టకుండా ఉండడానికి పల్లెటూరోడిలా వేషం మార్చాడు... వీడి తల మీద రివార్డుంది..." అనేసాడు... అంతే క్షణంలో వేన్ ఆగింది, వెంటనే పరిగెడుతున్న వెంకటయ్యను ఆ ఇద్దరూ వేన్‌లోకి లాగి తలుపేశారు. రెప్పపాటుకాలంలో వేన్ వేగంగా ముందుకు వెళిపోయింది.

పక్క వీధిలోంచి కుక్కను తరుముతూ వచ్చిన పకీరు వేన్‌లో వెంకటయ్యను పోలీసువారు తీసుకువెళ్ళడంతో ఆశ్చర్యానికి, ఒకింత భయానికి లోనయ్యాడు. ముందుకు వెళ్ళలేక అలాగే ఆ రోడ్డు మీద కూలబడ్డాడు. పావుగంట తర్వాత స్థిమితపడి ఇక నడిచే ఓపిక లేక తన గుడిసె కేసి బయలుదేరాడు.

* * * * *

మూడు రోజుల తర్వాత...

ఉదయం ఏడయింది గుడిసెలోంచి బైటికొచ్చిన పకీరు, ఆమీన్ టీ బంకు కేసి నడిచాడు. యాదగిరి ఇంకా చాలామంది గుమికూడా వున్నారు. ఆ గుంపులోని వ్యక్తి పేపరు చదువుతూ అందరికీ చెపుతున్నాడు. "అరే మన వెంకటయ్య ఎన్‌కౌంటర్‌లో ఖతమ్ అయ్యిండు. ఇదిగో ఫోటో.." అంటూ చూపించాడు.

పేపరులోకి తొంగిచూసిన పకీరుకు, నిర్జీవంగా శవంలా పడివున్న వెంకటయ్య

ఫోటో కనిపించింది. ఒక్కసారిగా భయంతో అతడి ఒళ్ళు జలదరించింది. ఆ పేపరు పట్టుకున్న వ్యక్తి ఇంకా చెపుతున్నాడు. "అరే ఏదో మతలబ్ అయింది, ఎవరో అనుకొని వీణ్ణి ఏసినారు.. వీడి మానాన వీడు కుక్కల్ని పట్టి పైసలు తెర్చుకునేటోడు.. వీని పేరు వెంకటయ్య మరి వెంకటయ్య వురఫ్. శేషు... అంటారేంది, ఏమిటో ఈ గొడవ సమజయితలేదు..."

పకీరుకు అతడి మాటలు వింటుంటే గుండెలో దడదడలాడాయి. అంతలోనే కుక్కలు గుర్తుకొచ్చి, యాదగిరిని తీసుకొని అక్కడనుంచి కదులుతూ

"ఒరేయ్ మూడు దొరుకుతాయ్‌రా, నేను తిన్నగా పోతా, నువ్ ఆ సందులోనించెలి ఉరుకు.." అని యాదగిరికి చెప్పి గబగబా నడవడం ప్రారంభించాడు పకీరు.

నడుస్తున్నా పకీరు చూపులు వాడిగా ప్రసరిస్తున్నాయి. రోడ్డుకి ఇరువైపులా వున్న మేడల్ని, గల్లీ పక్కన, చెత్త కుండీలను, డ్రైనేజీ సిమ్మెంటు గొట్టాలను, దేన్నీ వదలకుండా చూస్తున్నాడు. ఈ విశ్వంలో ఏమూల దాక్కున్నా ఆ కుక్కల్ని పట్టాలనే దృఢ నిశ్చయంతో పకీరు ముందుకు కదులుతున్నాడు ఇంతలో 'బోయ్' మంటూ కుక్క మొరిగిన శబ్దం... నాసికారంధ్రాలకు వాసన తగిలింది. వెంటనే అటెన్షన్‌లోకి వచ్చి తాడు విసరబోయి ఆగిపోయాడు. ఎదురుగా వస్తున్న ఒక వ్యక్తి. ఆయన ఖరీదైన బట్టలు తొడుక్కున్నాడు. దర్జాగా, పొగరుగా వున్నాడు. అతడి మీసాలు మెలేసి వున్నాయి. ఆ మీసాల్లోంచి పౌరుషం తొంగా చూస్తోంది. అతడి చేతిలో వున్న తళతళ మెరిసే గొలుసు. దాన్ని మెడలో తగిలించుకున్న ఓ కుక్క. అది వీధుల్లో తిరిగే కుక్కయినా డబ్బున్నవారి ఇంట్లో పెరగడం వల్ల బలంగా ధృఢంగా, దాని యజమానిలాగానే పొగరుగా నిలబడింది. పకీరు ఆ కుక్కను చూసి తలొంచుకున్నాడు. ఆకుక్క నిర్లక్ష్యంగా తలెగరేసి, "నేను వీధి కుక్కను కాదోయ్, నన్ను చూసుకునేందుకు ఓ సంరక్షకుడున్నాడు, నువ్వేమైనా చేస్తే నీ తాట ఒలిచేస్తాడు జాగ్రత్త." అన్నట్టునిపించి అక్కణ్ణుంచి నిర్లిప్తంగా కదిలేడు పకీరు.

అప్పటికే మధ్యాహ్నం అయింది. పూర్తిగా నీరసం వచ్చి ఇక నడవలేక బోరింగ్ పంపుదగ్గర కూలబడ్డాడు.

కడుపులో వేసే ఆకలి అరుపుల్ని శాంతింపచెయ్యాలని కడుపునిండా నీళ్ళు తాగి ఆ రోడ్డు పక్కే వాలిపోయాడు పకీరు. కళ్ళు మూతలు పడగానే నిద్రపట్టేసింది.

నల్లకుక్క జాలి చూపులు చూస్తూ ఎదురుగా నిలబడింది. వెంటనే కళ్ళు నులుముకుంటూ లేచి చూసాడు పకీరు. ఎదురుగా యాదగిరి మట్టికొట్టుకుపోయిన శరీరంతో.

"ఏమిరా? దొరికనయ్యా కుక్కలు" ఆత్రంగా అడిగాడు పకీరు.

"లేదురా, రెండు దొరకలేదు, మూడోది దొరికేటందుకు అవకాశం లేకపాయె" అన్నాడు యాదగిరి నిరాశగా.

"మనలో ఒకడు పోనే పోయిండు, ఇంకోడు తగిలిండా ఏమైందిరా, చేతి కందిన కుక్కల్ని జారవిడుచుకున్నాము" అంటూ బాధపడ్డాడు పకీరు అతడీ మాటలకు యాదగిరి సమాధానం చెప్పకుండా ముందుకు నడిచాడు. పకీరు అతడిని అనుసరించాడు. అర ఫర్లాంగు దూరం నడిచి బ్రిడ్జి దాటి హైవే రోడ్డుమీద కొచ్చి ఆగిపోయాడు. పకీరు ప్రశ్నార్థకంగా చూస్తూ ఉండిపోయాడు. యాదగిరి తన చూపుడు వేలుతో చూపించే సరికి పకీరు అంతవరకూ చూడని దృశ్యం.

ఎదురుగా తనూ, అంతకు ముందు వెంకటయ్య వేటాడిన నల్లకుక్క నిర్జీవంగా దాని తల చిట్లిపోయి వుంది. పొట్టలోనించి బయటకు వచ్చిన పేగులు దాని చుట్టూ గడ్డ కట్టినట్టుగా రక్తం. ఆ కుక్కను ఆస్థితిలో చూసిన పకీరుకు కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

"ఒరే యాదగిరీ, గీ కుక్క కేమాయెరా? ఎట్ల చచ్చిందిరా? నువ్వేమన్నా బండవెట్టి కొట్టివా ఏంది?" అన్నాడు బాధపడుతూ.

"ఈ రోడ్డు ముంగట మస్తుగా తిని పండుకుంది. దొరికింది రా అని తాడు

విసిరినా ఏదో దవాఖాన వాండ్ల జీపు గట్లనే వచ్చింది, ఆ జీపును జూసి, నన్ను జూసి ఒక్కసరి మీద కెగిరిందేమో, ఖతమ్ సచ్చిపోయింది, బద్మాష్‌గాడు గట్లనే తోలుకుపోయిండు, మనం ఏం జేస్తం, మన తక్‌దీర్ (అదృష్టం) ఇట్లున్నది, ఎవర్నని ఏంఫాయిదా (లాభం)?" అన్నాడు నిట్టూరుస్తూ యాదగిరి.

పకీరు ఆ కుక్కను అలా చూస్తూనే నిలబడ్డాడు. తనని వేటాడిన మానవ జాతి నుంచి విముక్తి లభించినందుకు అది ప్రశాంతంగా నిద్రపోతున్నట్టే కనిపించింది. తను వీధి కుక్కలా పుట్టక ఏ దొరబాబింట్లోనో పెరిగితే ఈ దిక్కుమాలిన చావు రాక పోయేది కదా, ఇంతమంది నన్ను వేటాడకపోయ్యే వారా అని కుక్క చెబుతున్నట్లనిపించింది పకీరుకు ఆ క్షణంలో ఆ కుక్క కళ్ళల్లో చనిపోయిన వెంకటయ్య కనిపించాడు. అతడి కడుపులో పేగు కదిలినట్లయింది.

అనాధలా వీధుల్లో బ్రతికే తమ బతుకులూ, ఆ కుక్కలా, వెంకటయ్యలా ముగుస్తాయా? అనే బ్రతుకు భయం పకీరు లో మొదలయింది.

– రచన, ఏప్రియల్ 2002

* * * * *